ఇందిరమ్మ కాలనీలో వసతులు కరువు


ఇందిరమ్మ కాలనీలో కురుమర్తి రోడ్డు వెంబడి డ్రెయినేజీలో పెరిగిన జమ్మి


కట్టంగూర్ రెండో వార్డులో డ్రెయినేజీపై ప్రమాదకరంగా ఉన్న గుంత

- పూర్తిస్థాయిలో నిర్మించని డ్రెయినేజీలు, సీసీ రోడ్లు
- మురుగుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కట్టంగూర్ : మండల కేంద్రం శివారులోని కురుమర్తి రోడ్డు వెంబడి ఉన్న ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ ఏర్పడి 16 సంవత్సరాలు దాటినా నేటి వరకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించ కపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీలో పేరుకుపోయిన పలు సమస్యలతో ప్రజలు నిత్యం కుస్తీ పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. డ్రెయినేజీలు అన్ని వీధుల్లో నిర్మించకపోవడంతో మురుగు వీధుల్లో ప్రవహించి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు నిల్వ ఉండడంతో వీధులన్నీ కంపు కొడుతూ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కాలనీ మురుగంతా కురుమర్తి రోడ్డును ఆనుకుని ఉన్న డ్రెయినేజీలో వచ్చి చేరడంతో అక్కడ నిల్వ ఉండి గడ్డి, జమ్మి విపరీతంగా పెరిగాయి. దీంతో దుర్వాసన వస్తోంది. డ్రెయినేజీలో పిచ్చిచెట్లు, జమ్మిచెట్లను తొలగించి కాలువ నిర్మించాలని కాలనీ ప్రజలు కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటికీ అందని కృష్ణా జలాలు

మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా కాలనీలో రెండు సంవత్సరాల క్రితం ఇంటింటికి పైపులైన్ ఏర్పాటు చేశారు. వారం రోజులు పాటు నీరు సరఫరా చేసి నిలిపివేశారు. నీరు సరఫరా కాకపోవడంతో రెండు సంవత్సరాలుగా కాలనీలో ఏర్పాటు చేసిన మినీ కృష్ణా జలాల ట్యాంకుల వద్ద నుంచి ప్రజలు మంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ పైపులైను ఏర్పాటు చేసి నీరు సరఫరా చేయకపోవడం పట్ల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులను, అధికారులను అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీపై గుంత

మండల కేంద్రంలోని రెండోవార్డులో సాందీపని పాఠశాల సమీపంలో ఉన్న డ్రెయినేజీలో చెత్త పేరుకుపోవడంతో 6 నెలల క్రితం జీపీ అధికారులు రంధ్రం ఏర్పాటు చేసి శుభ్రం చేశారు. తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిత్యం ఈ దారిగుండా పోయే ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీపై గుంత ఉండడంతో ఈ దారిగుండా ఆటోలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ దారి గుండా ప్రజలు, విద్యార్థులు వెళ్లేందుకు జంకుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి డ్రెయినేజీపై గుంతను పూడ్చాలని, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీపై గుంతను పూడ్చాలి



మండల కేంద్రంలోని రెండో వార్డులో సాందీపని పాఠశాల సమీపంలో ఉన్న డ్రెయినేజీపై గుంత కారణంగా ఆటోలు వెళ్లే పరిస్థితి లేదు. ఈ దారి గుండా ఆటోలో విద్యార్థులకు తీసుకెళ్లేందుకు ఇబ్బంది కలుగుతోంది. పంచాయతీ అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు చొరవ చూపి డ్రెయినేజీపై గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించాలి.

– మద్దెల శంకర్, కట్టంగూర్

దేశ ప్రజలు మోదీపై నమ్మకంతో ఉన్నారు

- నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి

కనగల్: దేశ ప్రజలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై నమ్మకంతో ఉన్నారని నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టు కమీషన్ల కోసమే పనిచేస్తోందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేసి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ కో కన్వీనర్ పిల్లి రామరాజు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, గద్దం మహేష్, మండల అధ్యక్షుడు పులకరం భిక్షం, ప్రధాన కార్యదర్శులు దాసరి వెంకన్న, బైరగోని అశోక్, నందగౌడ్, నిమ్మల సుధాకర్‌రెడ్డి, మాదగోని ఏడుకొండలు, జనగాం సురేష్, పంతంగి సైదులు, మనిమద్ది వీరయ్య, కార్యదర్శులు తలారి కిరణ్ కుమార్, చింతల శంకర్, మారగోని సురేష్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జిల్లా శేఖర్, మాదగోని బాలకృష్ణ, ఆదిమల్ల దేవేందర్, భద్రమ్మ, పాలకూరి సరిత, కానుగు నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుడి ఆలయ వార్షికోత్సవం


వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణంలోని ఏవీఎం విద్యా సంస్థల ఆవరణలో గల శ్రీ సాయి ఆలయం 25వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఏవీఎం విద్యా సంస్థల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వేడుకల్లో ఏవీఎం విద్యా సంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ కందాల స్వప్న, కందాల శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మిట్టా పూర్ణచందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఏ మంజూరు చేయాలని వినతి

నల్లగొండ టౌన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో పీఆర్‌సీ చైర్మన్ శివశంకర్‌కు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్ వినతి పత్రం అందజేశారు. పెన్షనర్లకు ఆర్టీసీ బస్‌లో ప్రయాణ రాయితీ కల్పించాలని, జిల్లాకు రెండు ఈహెచ్‌ఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, మెడికల్ అలవెన్స్ పెంచాలని కోరారు. చైర్మన్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఓంప్రకాష్, బాలయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు యాదగిరిరెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

శాలిగౌరారం: స్వాతంత్ర్య సమరయోధుడు చామల యాదగిరిరెడ్డి 6వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, బండపల్లి కొమరయ్య, దొంతూరి శంకరయ్య, ఆకుల శ్రీను, కుంభం యాదయ్య, లోడంగి మహేశ్, గుండ్ల సురేశ్, రామ్మూర్తి, గూని వెంకటయ్య, జితేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న శివలీల

కనగల్: దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గురువారం భక్తులకు న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ శివలీల మాట్లాడుతూ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ఆర్థికసాయం అందించిన మర్రిగూడ మండలం లంకలపల్లి గ్రామానికి చెందిన కాశీం సైదాబీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రావు



నల్లగొండ టౌన్ : ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్, సీడ్స్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జాలిపర్తి నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా బండ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తేలు రవి, సహాయ కార్యదర్శిగా జి.చలపతిరావు, నాగరాజు, కోశాధికారిగా వాస మధులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎంపీపీగా అవ్వారి గీత



చండూరు : ఇప్పటివరకు వైస్ ఎంపీపీగా ఉన్న అవ్వారి గీత శ్రీనివాస్ గురువారం చండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ కార్యాలయ ఉత్తర్వుల మేరకు గీతకు ఎంపీపీగా బాధ్యతలను అప్పగించామని ఎంపీడీఓ తెలిపారు. ఈ నెల 1న పల్లె కళ్యాణిరవికుమార్‌పై అవిశ్వాసం నెగ్గడంతో ఎంపీపీ స్థానం ఖాళీ అయింది. ఈ సందర్భంగా గీతను జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఉడతలపల్లి ఎంపీటీసీ కావలి మంగమ్మ ప్రసాద్, గట్టుప్పల్ మాజీ ఎంపీటీసీ బండారు చంద్రయ్య, పున్న కిశోర్, చెరుపల్లి కృష్ణ, పున్న ఆనంద్, చిలువేరు అయోధ్య, జూలూరు పురుషోత్తం ఘనంగా సన్మానించారు.

మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా సరిత


సరితను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

కనగల్: బీజేపీ మహిళా మోర్చా మండల ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన పాలకూరి సరిత గురువారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సరితను బీజేపీ మండల నాయకులు అభినందించారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

చౌటుప్పల్: మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో హైదరాబాద్- విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఎస్‌ఎస్‌టీం ఆధ్వర్యంలో గురువారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నోటిఫి కేషన్‌కు క్రితం అక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తీసేశారు. గురువారం నుంచి నోటిఫికేషన్ ప్రక్రియ మొదలుకావడంతో తిరిగి ప్రారంభించారు.

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలి

మర్రిగూడ : మండల కేంద్రంలో గతంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగాయని, ప్రస్తుతం అవకతకవలకు తావు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు నోముల వెంకన్నయాదవ్ అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో జరిగిన అవకతవకల కారణంగా అనేక మంది రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఈ యాసంగి సీజన్‌లో రైతులకు మద్దతు ధర అందించి న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట పగడాల లింగయ్య, పుప్పాల యాదయ్య ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న కుల సంఘం ప్రతినిధులు

చిట్యాల: వెలిమినేడు గ్రామానికి చెందిన అంతటి వెంకటరమణగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి ఇంటి పేరు గల కుల సంఘం ప్రతినిధులు సేకరించిన రూ.20 వేలను గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అంతటి శ్రీహరి, అంతటి ఆదిమల్లేష్, నర్సింహ, అంజయ్య, మల్లేష్, సత్తయ్య, రాజు, ఆది ప్రకాష్, మల్లం మహేష్, పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించాలని ప్రచారం

చండూరు : భువనగిరి పార్లమెంట్ నియోజవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం మండల పరిధిలోని నెర్మట గ్రామంలో సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఎం చండూరు మండల సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్, ఈరటి వెంకన్న, నారపాక శంకరయ్య, బొమ్మరగోని యాదయ్య, బల్లెం స్వామి, బురుకల అంజయ్య గౌడ్, లక్ష్మమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

రాములోరి తలంబ్రాల బుకింగ్ గడువు పెంపు

మిర్యాలగూడ టౌన్: భద్రాద్రి రాములోరి తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు ఆర్టీసీ గడువు పెంచిందని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్, ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఇన్‌చార్జ్ పరంగి నాగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా భద్రాద్రి రాములోరి తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. ముందుగా ఈ నెల 18వ తేదీ వరకు తలంబ్రాల బుకింగ్‌కు అవకాశం ఉన్నదని, ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఈ నెల 25వ తేదీ వరకు బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామన్నారు. రూ.151తో ఆర్టీసీ బస్టాండ్‌లోని లాజిస్టిక్స్ సెంటర్లో కానీ, వెబ్‌సైట్‌లో గానీ బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


నకిరేకల్ : చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


నల్లగొండ : చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


నల్లగొండ టౌన్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

నకిరేకల్ : రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని ఏవీఎం హైస్కూల్‌లో చదివిన 1990-91 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏవీఎం పూర్వ విద్యార్థులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవి కాలంలో పాదచారులు, వాహనదారులతోపాటు వివిధ పనులు నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పూజర్ల శంభయ్య, ఏవీఎం విద్యా సంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నల్లగొండ టౌన్ : శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక తిరుమల థియేటర్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, యాదగిరి, సమితి కన్వీనర్ సందీప్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, రాము, విశ్వేశ్వర్, మురళి, కృష్ణబాబు, వంశీ పాల్గొన్నారు.

నల్లగొండ: వడ్డేపల్లి కాశీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని నెహ్రూగంజ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రామన్నపేట మాజీ ఎమ్మెల్యే వడ్డేపల్లి కాశీరాం పేరు మీద ఫౌండేషన్ స్థాపించి వారి మనవడు కాశీరాం ప్రజలకు సేవ చేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ సభ్యులు మేడి శ్రావణకుమారి, వార్డు కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్ గౌడ్, కాంచనమాల, వడ్డేపల్లి శ్రీ మహాలక్ష్మి, వడ్డేపల్లి ఎల్లోర పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ధాన్యం లోడింగ్‌ను పరిశీలిస్తున్న డీపీఎం

కట్టంగూర్ : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీపీఎం మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మునుకుంట్ల, ఈదులూరు, పరడ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎగుమతి, వసతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా, లారీల కొరత లేకుండా చూడాలని నిర్వాహకులకు, ఐకేపీ సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లో రైతులకు సరిపడా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఎం సైదులు, సీసీ మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం


శ్రీసీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

శాలిగౌరారం: శ్రీరామనవమి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు శేషభట్టర్ నర్సింహాచార్యులు, రత్నమాచార్యులు, రామచంద్రాచార్యులు, జగన్మోహనాచార్యులు, రఘునందనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా కనులపండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు తలంబ్రాలు, నూతన పట్టువస్త్రాలను స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం భక్తులు శ్రీసీతారామలక్ష్మణమూర్తులను అశ్వవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు చాడ హతీష్‌రెడ్డి, గుజిలాల్ శేఖర్‌బాబు, వెంకట్ రెడ్డి, దేవేందర్, శ్రీను, సత్తయ్య, పరమేశ్, రవి, అరవింద్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన వేడుక


రామగిరి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో పుష్పార్చన చేస్తున్న అర్చకులు


రామగిరి శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


రామకోటి స్థూప ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో గురువారం లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాదగిరాచార్యులు, శఠగోపాలచార్యులు, రఘునందన భట్టార్, రంగనాథచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రామకోటి ఆలయంలో గీతా యజ్ఞం

నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లో గల రామకోటి స్తూప ఆలయంలో గురువారం గీతా యజ్ఞం, అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కన్వీనర్ పారేపల్లి శ్రీనివాస్, తేలుకుంట్ల శ్రీనివాస్, సోమవరపు రాజేశ్వరరావు, గుడిపాటి సత్యనారాయణ, బండారు వెంకన్న, వనమా మనోహర్, నాల వెంకటేశ్వర్లు, మేడం విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

36 బస్తాల ధాన్యం చోరీ

శాలిగౌరారం: మండలంలోని భైరవునిబండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఓ రైతుకు సంబంధించిన 36 బస్తాల ధాన్యం బుధవారం రాత్రి చోరీకి గురైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. భైరవునిబండ గ్రామానికి చెందిన ఏమిరెడ్డి నర్సిరెడ్డి తనకున్న ఐదెకరాల భూమిలో వరి సాగుచేశాడు. రెండు వారాల క్రితం పంటను కోసి ధాన్యాన్ని గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. ఆ ధాన్యాన్ని బుధవారం సాయంత్రం కాంటా వేయించగా 259 బస్తాలు అయ్యాయి. రాత్రి కావడంతో లారీలోకి లోడ్ చేయలేదు. గురువారం ఉదయం కేంద్రానికి వచ్చి చూసేసరికి 223 బస్తాల ధాన్యం మాత్రమే ఉంది. 36 బస్తాల ధాన్యం(14.40 క్వింటాలు) గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన ధాన్యం విలువ రూ.31,732 ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చినప్పటి నుంచి లారీలో లోడ్ చేసేవరకు రైతులే ధాన్యాన్ని కాపాడుకోవాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలు ఆండాలు, ఐకేపీ ఏపీఎం జానకి తెలిపారు. బాధిత రైతు నర్సిరెడ్డికి సంబంధించిన ధాన్యం బుధవారం సాయంత్రం ఆలస్యంగా కాంటా జరిగిన విషయం వాస్తవమే కానీ.. కాంటా జరిగిన ధాన్యం బస్తాలు తమ ఆధీనంలోకి రాలేదని వారు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీ డే


ప్రీ స్కూల్స్ బుక్స్ ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిట్యాల: వట్టిమర్తి, ఉరుమడ్ల, చిట్యాల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఈసీసీ డే (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే) నిర్వహించారు. ఆరోగ్య విద్యపై గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించారు. చిన్నారుల ప్రతిభకు సంబంధించిన కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ప్రీ స్కూల్ బుక్ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం స్వరాజ్యం, అంగన్‌వాడీ టీచర్లు దాడి అరుణ, బూరుగు అరుణ, పి.అంజమ్మ, ఆయా మమత, జానకమ్మ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

చౌటుప్పల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక జిల్లా అదనపు అధికారి అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో ఉన్న దివీస్ పరిశ్రమలో గురువారం అగ్నిమాపక పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రమాదాలు సంభవించినప్పుడు చేపట్టే నివారణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల నివారణకు అత్యాధునికమైన యంత్రాలను అందుబాటులో ఉంచిన దివీస్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమ ఈహెచ్‌ఎస్ విభాగం జనరల్ మేనేజర్ బాల కిషోర్, ఏజీఎం సాంబశివరావు, సీనియర్ ఆఫీసర్ రంగారావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


వెంకటేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మర్రిగూడ : వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్ గురువారం ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులతోపాటు ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంప్‌గ్రౌండ్‌లో ఉదయం వాకర్స్‌తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అదేవిధంగా బస్టాండ్ ఎదురుగా ఉన్న టీ స్టాల్ వద్ద టీ తాగుతూ స్థానికులతో చర్చించారు. మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కార్మికుల అడ్డా వద్ద కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీల్లో 5 గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేసి పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పేదలు అన్ని రకాలుగా దోపిడీకి గురయ్యారని, కానీ కాంగ్రెస్ పేద కోసం ఆలోచించే పార్టీ అని, వారి సంక్షేమానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, తమ్మడబోయిన అర్జున్, పొదిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.